

మామిడాలపల్లిలో పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

## బీఆర్‌ఎస్ పథకాలకు ఆకర్షితులయ్యే చేరికలు

- హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, నవంబర్ 21: సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని బీఆర్‌ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. వీణవంక మండలంలోని రామకృష్ణాపూర్, మామిడాలపల్లి గ్రామాల్లో పాడి కౌశిక్‌రెడ్డి జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ గ్రామ సర్పంచ్ మేకల సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ఆ గ్రామ ఉప సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు దూడపాక రాజకొమురయ్య బీఆర్‌ఎస్‌లో చేరారు. అంతేకాకుండా మండలంలోని వెల్బాక, గంగారం, మామిడాలపల్లి గ్రామాలకు చెందిన 50మంది కాంగ్రెస్, బీజేపీ యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పాడి కౌశిక్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు అప్పని హరీశ్, యార కుమార్, కిషన్‌రెడ్డి, పుల్లారెడ్డి, రవీందర్, రాజు ఉన్నారు.

## ప్రతిపక్ష నాయకులు ఇకనైనా కళ్లు తెరవాలి

- రసమయిపై అసత్య ఆరోపణలు మానుకోవాలి
- ప్రజా ఆశీర్వాదసభ విజయవంతమవడంతో ఆ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి
- రసమయి 60 వేల మెజార్టీతో గెలవడం ఖాయం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, నవంబర్ 21: ఇటీవల నిర్వహించిన బీఆర్‌ఎస్ మానకొండూర్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వద సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్, బీజేపీ నాయకుల గండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు తెలిపారు. ఎమ్మెల్యే రసమయిపై అసత్య ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ఆశీర్వాద సభకు వచ్చిన ప్రజలను చూసి జీర్ణించుకోలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. ఇకనైన కాంగ్రెస్ నాయకులు కళ్లు తెరువాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసిన అందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాద సభ నుంచి నియోజకవర్గ ప్రజలకు వరాల జల్లు ప్రకటించడంపై ధన్యవాదాలు తెలిపారు. హుజూరాబాద్ తరహాలో మానకొండూర్ నియోజకవర్గం మొత్తం దళితబంధు అమలు చేస్తానని సీఎం హామీ ఇవ్వడం, ఆటో ఫిట్‌నెస్ చార్జీలు రద్దు చేస్తామని, ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయడం, ఖాళీ స్థలం ఉన్న వారికి గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఅర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ 60వేల మెజార్టీతో గెలవడం ఖాయమని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, సర్పంచులు రొడ్డ పృథ్వీరాజ్, దేవ సతీష్‌రెడ్డి, రామంచ గోపాల్‌రెడ్డి, ఎనగందుల సుదర్శన్, మర్రి కొండయ్య, నాయకులు గుర్రం కిరణ్‌గౌడ్, శాతరాజు యాదగిరి, నెల్లి మురళి, దండబోయిన శేఖర్, పారునంది కిషన్, కొత్తకొండ నాగయ్య, కొట్టె నరేశ్, ఇస్కుల్ల ఆంజనేయులు, బోడ రాజశేఖర్, దుబ్బాసి అవినాష్, నెల్లి శంకర్, వరికోలు రాకేశ్, పురం అనిల్, రాయికంటి కిరణ్, కనకం అశోక్, ఉండింటి అనిల్, బొల్లం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఅర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు

## అంతర్జాతీయ విద్యావేత్తల సదస్సుకు ప్రసాదరావు

- 26న ఆస్ట్రేలియాకు పారమిత విద్యాసంస్థల అధినేత

కమాన్‌చౌరస్తా, నవంబర్ 21: ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వం వివిధ దేశాల నుంచి విద్యావేత్తలతో నిర్వహించే సదస్సుకు కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రపాదరావు కు ఆహ్వానం అందింది. విక్టోరియా రాష్ట్ర ప్రభు త్వం ఆస్ట్రేలియా వారు దక్షిణ ఆసియా ఖండం నుంచి 25 మంది ప్రముఖ విద్యావేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈ విద్యావేత్తల బృందం విక్టోరియాలోని యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్, ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్, విక్టోరియా యూనివర్సిటీ, మోనష్ యూనివర్సిటీ, స్విన్ బర్న్ యూనివర్సిటీ, లట్రోబ్ యూనివర్సిటీ, ఆర్‌ఎంఐటీ యూనివర్సిటీ, డీకిన్ యూనివర్సిటీ, బ్లా క్ బర్న్ హైస్కూల్‌ను సందర్శించనున్నారు. ఆ తర్వాత విక్టోరియన్ ఎడ్యుటెక్ కంపనీస్ ఇంటర్నేషనల్ చాంబర్ సమావేశంలో పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా విక్టోరియన్ ప్రభుత్వం, దక్షిణ ఆసియా విద్యావేత్తలు, ఆస్ట్రేలియా యూనివర్సిటీలు, దక్షిణ ఆసియా విద్యాసంస్థల పార్టనర్‌షిప్ అవకాశాలను అన్వేషిస్తారు. ఈ మేరకు విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసాదరావుకు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రసాదరావు

# పదేండ్ల అభివృద్ధికి ఓటేయండి

- ప్రతిపక్షాలకు ఓటేస్తే అభివృద్ధి ఆగిపోతుంది
- అభివృద్ధిని కొనసాగించడం వీళ్ల తోటి అవుతుందా ?
- కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్



56వ డివిజన్ ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల

కార్పొరేషన్, నవంబర్ 21: కాంగ్రెస్, బీజేపీ చెబుతున్న తప్పుడు మాటలు నమ్మి ఈ ఎన్నికల్లో వారికి ఓటేస్తే నగరంలో ప్రస్తుతం సాగుతున్న అభివృద్ధి ఆగిపోతుందని, పదేండ్ల అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటేయండి అని కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి,మంత్రి గంగుల కమలాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలో సాగుతున్న కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్‌లను వీరు పూర్తి చేస్తారా..? అని ప్రశ్నించారు. నగరంలో కేబుల్‌బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్, వేంకటేశ్వర ఆలయం, ఇస్కాన్ టెంపుల్స్‌ను తానే ప్రారంభించానని, వాటిని పూర్తి కూడా చేస్తానని భరోసా కల్పించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం నగరంలోని 56, 59, 60 డివిజన్లలో మంత్రి గంగుల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కరీంనగర్ గడ్డపై ఒక్కసారి గెలిచిన వారు వరుసగా రెండోసారి గెలిచిన చరిత్ర లేదని, కానీ హ్యాట్రిక్ విజయాలు కట్టబెట్టిన ప్రజలకు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. సమైక్య పాలనలో కరీంనగర్‌లో గుంతలమైన రోడ్లతో ఇబ్బందులు పడ్డామన్నారు. పదేండ్ల తెలంగాణలో రూ.వెయ్యి కోట్ల నిధులను కేసీఆర్ నుంచి తీసుకొచ్చి నగరంలోని రోడ్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్దామన్నారు. గతంలో ఎవరైనా పనిష్‌మెంట్ కింద కరీంనగర్‌కు బదిలీ చేసే వారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు కరీంనగర్ ఎలా ఉందో..? మీకు కళ్ల ముందు కనిపిస్తుందన్నారు. కరీంనగర్ అభివృద్ధికి కేసీఆర్ రూ. వేల కోట్ల నిధులు ఇచ్చారన్నారు. 50 ఏండ్ల దారిద్ర్యం కావాలో.. పదేండ్ల అభివృద్ధి కావాలో..? ప్రజలు ఆలోచించాలన్నారు. ఇప్పుడు ఒక్క తప్పు చేస్తే మన పోరగాళ్ల నోట్లో మన్ను కొట్టినట్టు అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ 32 భూకబ్జా కేసులు ఉన్న రౌడీషీటర్‌కు టికెట్టు అమ్ముకుందని విమర్శించారు. ఆయనకు ఓట్లు వేస్తే మన భూములు ఉంటాయా..? అని ప్రశ్నించారు. ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఎప్పుడైనా ప్రజల గురించి పట్టించుకున్నారా..? అని నిలదీశారు. తాను నగరాభివృద్ధికి రూ. వేల కోట్ల నిధులు తీసుకొస్తే కేంద్రం నుంచి ఎంపీగా ఒక్క నయా పైసా కూడా తీసుకురాలేని అసమర్థ ఎంపీ బండి సంజయ్ అని విమర్శించారు. హిందువునని చెప్పుకునే నీవు ఆలయాలు కోసం నిధులు ఎందుకు తీసుకురాలేదన్నారు. బండి ఏం అభివృద్ధి చేశావని నీకు ఓటు వేయాలని ప్రశ్నించారు. 2015లో కరీంనగర్‌కు వచ్చిన స్మార్ట్‌సిటీని 2019లో ఎంపీగా గెలిచిన బండి సంజయ్ నేనే తీసుకువచ్చానని చెప్పడం ఎంత అబద్ధామో ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ యాభై ఏండ్ల తెలంగాణను మోసం చేశాయని దుయ్యబట్టారు. తనను మరోసారి గెలిపిస్తే నగరాన్ని దేశంలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటుగా నగరాన్ని మల్టీనేషనల్ కంపెనీలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో తెలియని బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందన్నారు. నగరంలో సాగుతున్న అభివృద్ధి పూర్తి కావాలన్న, మరింత వేగంగా పూర్తి కావాలన్న బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని విన్నవించారు. దొంగలకు అవకాశం ఇవ్వదని కోరారు. ప్రచారంలో నగర మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్, కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్‌రావు, గందె మాధవి, రమణరావు, కో ఆప్షన్ సభ్యుడు అజిత్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు కొత్త జైపాల్‌రెడ్డి, సదానందచారి, అజిత్, కర్ర సూర్యశేఖర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్గీకరణ పేరుతో మోసగించేందుకు యత్నం

- పదేళ్లుగా చేయనిది ఇప్పుడు చేస్తారంటే నమ్మేదెలా?
- బీసీ ముఖ్యమంత్రి పేరుతో బీజేపీ కొత్త డ్రామాకు తెర
- యాభై ఏండ్ల పాలనలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు !
- సంక్షేమ పథకాలే కేసీఆర్ పనితీరుకు నిదర్శనం
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, తదితరులు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 21: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేండ్లుగా ఎస్సీల వర్గీకరణ చేయకుండా, తెలంగాణ ఎన్నికలు వచ్చాక, వారికి ఏబీసీడీల వర్గీకరణ గుర్తుకు రావడం శోచనీయమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. మంగళవారం పట్టణంలోని సిటీ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నాయకులతో కలిసి మాట్లాడారు. మందకృష్ణ మాదిగను బీజేపీ మంత్రులు, నాయకులు తమ ఎన్నికల ప్రచారానికి వాడుకునేందుకు తీసుకెళ్లి ఆయనతో పెద్ద సినిమా తీయించారన్నారు. బీఆర్‌ఎస్‌కు, కాంగ్రెస్‌కు మాదిగలు ఓట్లు వేయద్దని, వర్గీకరణకు హామీ ఇచ్చిన బిజెపికి వేయాలని ఆయనతో అనిపించినంత మాత్రాన మాదిగలకు ఎవరికీ ఓటు వేయాలో, ఎవరికీ వేయకూడదో తెలుసునన్నారు. పదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ఎందుకు పాస్ చేయలేదో ముందుగా మాదిగలకు తెలపాలని డిమాండ్ చేశారు. కేవలం తెలంగాణలో ఓట్ల లబ్ధి కోసమే బీజేపీ ఎస్సీల వర్గీకరణ స్లోగన్‌ను తీసుకుని బీఆర్‌ఎస్‌పై కావాలని దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. బీసీని ముఖ్యమంత్రి చేస్తామని బీజేపీ ప్రకటించడం ఒక డ్రామా అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేత బండి సంజయ్‌ని తొలగించి అగ్రవర్ణాలకు ఆ పదవి కట్టబెట్టడం అంటేనే బీజేపీపై బీసీలకు నమ్మకం లేకుండా పోయిందన్నారు. యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి రాష్ట్రానికి ఇద్దరికీ కూడా ఉద్యోగాలు ఇచ్చి న ఆనవాళ్లు లేవని విమర్శించారు. మూడు గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్సా.. 24 గంటలు ఇచ్చే బీఆర్‌స్సా.. ప్రజలు తెల్చుకోవాలని శ్రీనివాస్ పేర్కొన్నారు. 50 ఏండ్లుగా ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో చేసిన అభివృద్ధి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని, ఆయన పనితీరుకు అనేక ఉదాహరణలున్నాయన్నారు. 120 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరు పెట్టి దళితుల ఆత్మగౌరవాన్ని పెంచడం దళితుల పట్ల కేసిఆర్‌కున్న గొప్ప మనసుకు నిదర్శనమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నూతనంగా నిర్మించిన పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని సీఎం కేసీఆర్ సూచించిన పేరు పెట్టాలనే సోయి లేని బీజేపీ నేతలు, తెలంగాణలో ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణపై మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తెలంగాణలో మూడోసారి సీఎం కాబోయేది కేసీఆర్ అని జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్, బీఆర్‌ఎస్ వెంటనే ఉన్నారన్న నమ్మకం తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో హుజూరాబాద్ సింగిల్ విండో అధ్యక్షుడు ఎడవెల్లి కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు, పట్టణ శాఖ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ తులసి లక్ష్మణామూర్తి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మొలుగూరి ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకులు కొలిపాక సమ్మయ్య, పంజాల శ్రీధర్‌గౌడ్, పంజాల సదానందంగౌడ్, కేక్కర్ల సారయ్యగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, రాపర్తి అన్నయ్య లింగం, రాజు పాల్గొన్నారు.